

హోప్ ఐలాండ్‌లో 80 శాతం పోలింగ్

ప్రజాశక్తి - తాళ్లరేవు


మండలంలోని కోరంగి పంచాయతీ హోప్ ఐలాండ్‌లో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. కాకినాడ నుంచి సముద్రంలో బోటు ద్వారా ప్రయాణించి వెళ్లిన సిబ్బంది గ్రామానికి చేరుకుని పోలింగ్ నిర్వహించారు. గ్రామంలో 80 శాతం పోలింగ్ జరిగింది. 315 మంది ఓటర్ల ఉండగా 252 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. అందులో 112 మంది పురుషులు, 140 మంది మహిళలు ఉన్నారు.



హోప్ ఐలాండ్‌లో ఓటు వేస్తున్న ఓటర్లు

అంచనాల్లో నేతలు...!

- ఇవిఎంలలో అభ్యర్థుల భవితవ్యం
- విజయవకాశాలపై లెక్కలు వేసుకుంటున్న వైనం
- బూత్‌ల వారీగా పోలైన ఓట్ల లెక్కుంపుపై దృష్టి



ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ముగిసింది. ఇక లెక్కింపు మాత్రమే మిగిలింది. వచ్చే నెల 4న కౌంటింగ్, అదే రోజు ఫలితాలు విడుదల చేస్తారు. దేశ వ్యాప్తంగా పోలింగ్ ప్రక్రియ ముగిసిన తర్వాత ఓట్ల లెక్కింపు జరగనుంది. ఈ నేపథ్యంలో బరిలో నిలిచిన అభ్యర్థులతోపాటు రాజకీయ నాయకులు, జిల్లా ప్రజల్లోనూ ఫలితాలపై అప్పుడే అంచనాలు మొదలయ్యాయి. ఇటు ఫలితాలపై అంతటా ఆసక్తి నెలకొంది. కాకినాడ జిల్లాలో ఒక పార్లమెంట్, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎన్నికల పోలింగ్ జరిగింది. జిల్లా వ్యాప్తంగా 16,34,122 మంది ఓటర్లున్నారు. 78.52 శాతం అంటే 12,13,131 ఓట్లు పోలయ్యాయి. ఈసారి ఓటర్లలో ఓటు హక్కు వినియోగంపై చైతన్యం బాగా పెరిగింది. ఉదయం 6 గంటలకే వందల సంఖ్యలో ఆయా పోలింగ్ బూత్‌లకు చేరుకుని ఓటు వేసేందుకు బారులు తీరారు. రాత్రి 9 గంటల వరకు కూడా గంటలు తరబడి క్యూ లైన్లలో నిలబడి జనం ఓటేశారు. కొన్నిచోట్ల 11 గంటల వరకు కూడా పోలింగ్ కొనసాగిన పరిస్థితులు ఉన్నాయి.

లెక్కలు వేసుకుంటున్న అభ్యర్థులు

జిల్లాలో గతం కంటే భారీగా నమోదైన పోలింగ్‌పై ఎవరి లెక్కలు వాళ్లు వేసుకుంటున్నారు. బూతుల వారీగా పోలైన ఓట్ల వివరాలను దగ్గర పెట్టుకుని అంచనాలు వేసుకుంటున్నారు. ఏజెంట్ల సహకారంతో ఏయే వర్గాల ఓట్లు తమ వైపునకు వచ్చాయనే లెక్కలు వేసుకుంటున్నారు. తీర్పు తమకే అనుకూలమని కూటమి పార్టీలు ధీమాగా ఉన్నాయి. అటు అధికార వైసిపి నేతలు కూడా అంచనాల్లో మునిగి తేలుతున్నారు. కాకినాడ పార్లమెంటు స్థానం నుంచి పోటీ చేసిన వైసిపి అభ్యర్థి చలమలశెట్టి సునీల్ గెలుపు తనదే అంటూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో మూడుసార్లు పోటీ చేసి ఓడిపోవడంతో సానుభూతి ఉందని, తనకున్న కంపెనీలలో అనేకమందికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, పార్లమెంట్ పరిధిలో ప్రతి గ్రామానికి రూ.కోటి చొప్పున 400 గ్రామాలకు రూ.400 కోట్లు కేటాయించి అభివృద్ధి చేస్తానని హామీతో ప్రజలు తనను కచ్చితంగా గెలిపిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు కూటమి అభ్యర్థిగా బరిలో ఉన్న ఉదయ్ శ్రీనివాస్ తనకే గెలుపు ఛాన్స్ ఉందంటూ ఇప్పటికే ప్రచారం చేసుకుంటున్నారు. పిఠాపురంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు అనుకూలంగా పోలింగ్ పెద్దఎత్తున జరిగిందని ఆ పార్టీ నేతలు చెప్పుకుంటున్నారు. భారీ మెజారిటీతో గెలుపొందుతారంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇటు అధికార పార్టీ నుంచి బరిలో ఉన్న వంగా గీత కూడా గెలుపుపై ధీమాతో ఉన్నారు. వైసిపి ప్రభుత్వం అమలు జరిపిన సంక్షేమ పథకాల వలన ప్రజలు తనను ఆశీర్వదిస్తారని ఆమె చెబుతున్నారు. కాకినాడ సిటీలో మళ్లీ ప్రజలు తనకే పట్టం కట్టనున్నారంటూ సిట్టింగ్ ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి ధీమాతో ఉన్నారు. ప్రభుత్వ అమలు చేసిన పలు సంక్షేమ పథకాలు పేదలను ఎంతగానో ఆదుకున్నాయని, కాకినాడను స్మార్ట్ సిటీగా బాగా అభివృద్ధి చేయడంతో మెజారిటీ ఓటర్లు తమ వైపే ఉన్నారనే చెప్పుకుంటున్నారు. మరోవైపు కూటమి బలంతో కచ్చితంగా గెలుపు నాదే అంటూ వనమాడి కొండబాబు ఆనందంతో కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కాకినాడ రూరల్‌లో గట్టి పోటీ జరిగింది. మాజీ మంత్రి కన్నబాబు, జనసేన అభ్యర్థి నానాజీ మధ్య హోరాహోరీ పోరు జరిగింది. ఇక్కడ ఎవరు గెలుస్తారనే దానిపై అంచనాలు దొరకడం లేదు. కానీ ఎవరికి వారు గెలుపు ధీమాతో సాగుతున్నారు. జగ్గంపేటలో నువ్వా నేనా అంటూ తలపడిన మాజీ మంత్రి తోట నరసింహం, టిడిపి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ మధ్య రసవత్తర పోరు జరిగింది అయితే ఎవరు గెలుస్తారనే దానిపై ఉత్కంఠ నెలకొంది. మూడు దశాబ్దాలుగా నియోజకవర్గంలోనే ఉంటూ ప్రజల సమస్యలపై పోరాడుతున్న తనకే ప్రజలు మరోసారి అవకాశం ఇస్తారని నెహ్రూ ధీమాను వ్యక్తం చేస్తున్నారు. పెద్దాపురం నియోజకవర్గంలో మాజీ మంత్రి చినరాజప్ప మూడోసారి గెలుపొందే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని కూటమి పార్టీల నేతలు అంచనాలు వేస్తున్నారు. సౌమ్యుడుగా పేరు ఉన్న ఆయన టిడిపి హయాంలో పెద్ద ఎత్తున నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశారని చెబుతున్నారు. మరోవైపు వైసిపి అభ్యర్థి దవులూరి దొరబాబు సైతం గెలుపుపై లెక్కలు వేసుకుంటున్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి వరుపుల సత్యప్రభ సానుభూతితో విజయం తప్పకుండా సాధిస్తుందని ఆమె అనుచరులు అభిప్రాయపడుతున్నారు. తునిలో వైసిపి అభ్యర్థి దాడిశెట్టి రాజా గెలుపు చాన్స్ ఎక్కువగా ఉందని ఆయన అనుచరులు ధీమాతో ఉన్నారు. అటు కూటమి అభ్యర్థి యనమల దివ్య కూడా టిడిపి గెలుపు ఖాయం అంటూ అంచనాల్లో ఉన్నారు. ఇప్పటికే పోలింగ్ బూత్ వారీగా ఓటింగ్ వివరాలను తీసుకుని అంచనాలను రూపొందించుకున్నారు.

గణనీయంగా ఓటింగ్ శాతం పెరుగుదల: కలెక్టర్

ప్రజాశక్తి - కాకినాడ



రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు కల్గిన ప్రతీ ఒక్కరూ తప్పనిసరిగా వినియోగించు కోవాలని యంత్రాంగం చేపట్టిన అవగాహన, చైతన్య కార్యక్రమాలు ఓటింగ్ శాతం పెరుగుదలకు దోహదం చేశాయని కలెక్టర్ జె.నివాస్ అన్నారు. 2019లో జరిగిన సాధారణ ఎన్నికలలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో భాగంగా ఉన్న ప్రస్తుత కాకినాడ జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజక వర్గాలలో 78.52 శాతం ఓటింగ్ నమోదు కాగా, ఇది 2024 ఎన్నికలలో తుది గణాంకాలు సంకలనం పూర్తయ్యే సరికి దాదాపు 6 శాతం మేరకు పెరగనుందని ఆయన తెలిపారు. ప్రజా భాగస్వామ్యంతో జిల్లాలో విస్తృతంగా నిర్వహించిన స్వీప్ కార్యక్రమాలు ఇందుకు దోహదం చేశాయని, అర్హులైన వారందరూ ఓటర్లుగా నమోదు కావడంతోపాటు, ఓటు హక్కు ప్రాధాన్యతను గుర్తించి బాధ్యతగా వినియోగించుకునేలా చైతన్య పరిచాయన్నారు. ఈ ఉద్యమంలో చురుకైన భూమిక వహించిన జెఎన్‌టియు, రంగరాయ వైద్య కళాశాలల విద్యార్థులు, లాయర్లు, మత్స్యకార పెద్దలు, ఆటోడ్రైవర్లు, పోలీసులు, స్వచ్ఛంద సంస్థలను, ఆయన ప్రత్యేకంగా అభినందిం చారు. అలాగే ఓటు పవిత్రత, ప్రాధాన్యతలను చాటుతూ ప్రసిద్ధ యువ నేపథ్య గాయకుడు, యూత్ ఐకాన్ డాక్టర్ యశస్వి కొండేపూడి సహకారంతో చిత్రీకరించి, వివిధ మాధ్యమాల ద్వారా ప్రదర్శించిన ఓటే నీ ఆయుధం స్వీప్ వీడియో సాంగ్‌ను 57 వేలు పైబడి ప్రజలు తిలకించి, స్పందించారన్నారని తెలిపారు. స్వీప్ సదస్సులు, ర్యాలీలు, సందేశాత్మక గ్లో లైట్‌లు హోల్డింగ్స్, సెల్ఫీ పాయింట్లు వివిధ వర్గాల ప్రజల్లో ఓటు హక్కు ప్రాధాన్యతపై ఆలోచన, ఆచరణ జాగృతం చేసాయని అన్నారు. ఎన్నికలను పర్వదినంగా భావించి, ప్రజాస్వామ్యం పట్ల అచంచల విశ్వాసాన్ని చాటుతూ తమ ఓటు హక్కును వినియోగించుకున్న జిల్లా ఓటర్లు అందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. అలాగే పోలింగ్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసిన అధికారులు, సిబ్బంది అందరినీకలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.

విజయం జనసేన పార్టీదే : నాగబాబు

ప్రజాశక్తి - పిఠాపురం



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న నాగబాబు

ఈ నెల 13న జరిగిన ఎన్నికల్లో జనసేన పార్టీ విజయం సాధించడం ఖాయమని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె,నాగబాబు అన్నారు. మంగళవారం కుమారపురం గ్రామంలో గోకుల్ గ్రాండ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. పవన్ కళ్యాణ్ పిఠాపురం నుంచి పోటీ చేస్తున్నారని ప్రకటించిన తర్వాత నుంచి జనసైనికులు, వీర మహిళలు, జనసేన నాయకులు స్వచ్ఛందంగా ఆయన గెలుపు కోసం కృషి చేశారన్నారు. వారు చేసిన కష్టాన్ని ఎప్పటికీ మరువలేమన్నారు. నియోజవర్గ ప్రజలు పవన్‌ను సొంత మనిషిలా భావించారన్నారు. పవన్ ఇచ్చిన మాట ప్రకారం పిఠాపురం నియోజవర్గాన్ని దేశంలోనే అత్యున్నతమైన నియోజవర్గంగా తీర్చిదిద్దుతారని తెలిపారు. జనసేన ఎన్నికల కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి గుర్తుండిపోయే విధంగా పిఠాపురం నుంచి పవన్ కళ్యాణ్ గెలవబోతున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే వర్మ జనసేన పార్టీ అభ్యర్థి పవన్ కళ్యాణ్‌కి సంపూర్ణంగా మద్దతు ప్రకటించారని అన్నారు. చిన్న పెద్ద తేడా లేకుండా ప్రతి ఒక్కరు పవన్ కళ్యాణ్ పిఠాపురం నుంచి నెగ్గించుకోవాలని ప్రేమతో పని చేశారని వారికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో వేములపాటి అజయ్, మహీందర్‌రెడ్డి, శంకర్ గౌడ్, పిల్లా శివశంకర్, కె తమ్మయ్యనాయుడు, స్వరూపారాణి, ఈశ్వరి, పిఎన్.రాజు, రమ్యజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో కూటమిదే అధికారం : దాసు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమి అధికారంలోకి రావడం ఖాయమని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి ఏసుదాసు అన్నారు. మంగళవారం తన స్వగృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 13న జరిగిన ఎన్నికల్లో ప్రజల స్పందన చూశాక రాష్ట్రంలో వైసిపి అరాచక పాలనకు ముగింపు పలికినట్లుగానే భావిస్తున్నట్లు చెప్పారు. కాకినాడ పార్లమెంట్ పరిధిలో పార్లమెంటుతోపాటు అన్ని అసెంబ్లీ స్థానాలను కూటమి కైవసం చేసుకుంటుందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా భారీ ఎత్తున యువ ఓటర్లు పాల్గొని కూటమికి ఓట్లు వేసి తమ మద్దతుపలికినట్లు చెప్పారు. కాకినాడ పార్లమెంట్ పరిధిలో ఉన్న అన్ని నియోజకవర్గాలలో కూటమికి ఓటర్లు పట్టం కట్టనున్నారని అందువల్ల వారంతా ఉదయం ఆరు గంటలకే పోలింగ్ కేంద్రాల వద్దకు బారులు తీరడం నిదర్శనమన్నారు. రాష్ట్రంలో కూటమి 130 అసెంబ్లీ, 23 ఎంపీ సీట్లు కైవసం చేసుకుంటుందని చెప్పారు. కాకినాడ సిటీ, కాకినాడ రూరల్లో అరాచక పాలన జరుగుతుందని దీనికి ముగింపు పలుకుతున్నారన్నారు. రాష్ట్రంలో చాలా ప్రాంతాల్లో శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ఎన్నికల కమిషన్, పోలీస్ శాఖ ఎన్నో ప్రయత్నాలు చేసి అరికట్టారన్నారు. వైసిపికి తొత్తులుగా వ్యవహరించే పోలీసులను ఎన్నికల కమిషన్ ముందుగానే బదిలీ చేయడం వల్ల ప్రశాంతంగా పోలింగ్ జరిగిందన్నారు. టిడిపి అధినేత చంద్రబాబు మళ్లీ తాను సీఎంగానే అసెంబ్లీకి వెళ్తానని చెప్పిన వ్యాఖ్యలను ఓటర్లు గుర్తుపెట్టుకుని ఆయన సవాల్ స్వీకరించి అసెంబ్లీలోకి పంపేందుకు అధిక శాతం ఓటింగ్ నమోదుకు సహకరించారన్నారు. తాము రాష్ట్రవ్యాప్తంగా సుమారు 45 అసెంబ్లీ, 25 పార్లమెంట్ స్థానాల్లో పర్యటన చేసి కూటమి గెలుపునకు ప్రచారం చేశామన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుంటామంటూ ఓటర్లు ఉదయం నుంచి పోలింగ్ కేంద్రాల వద్దకు రావడం పట్ల వారికి ధన్యవాదాలు తెలిపారు. దొంగల ముఠా, గంజాయి, భూకబ్జాల నాయకుల పాలన నుంచి ఈ రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు యువత ముందుకు రావడం అభినందనీయమని దాసు పేర్కొన్నారు. ఈ సమావేశంలో కూటమి నాయకులు బాజిబోయిన వెంకటేష్ నాయుడు, జిల్ల రంగనాయకులు, వాసిరెడ్డి జ్యోతి వీరకుమార్, తుమ్మలపల్లి వాసు, బావిశెట్టి ప్రసాద్, సిద్ధ నూకరాజు, నవర చిట్టిబాబు పాల్గొన్నారు.



పట్టాను అందిస్తున్న గన్ని భాస్కరరావు

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య గ్లోబల్ బిజినెస్ స్కూల్‌లో గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. అదిత్యలో (2020 -2023)ఐఎంబిఎ, బిబిఎ, ఎంబిఎ ఉత్తీర్ణులైన విద్యార్థినీ, విద్యార్థులు వారి తల్లిదండ్రులతో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిఎస్ఎల్ అధినేత డాక్టర్ గన్ని భాస్కర్‌రావు, ఆదిత్య విద్యా సంస్థల డైరెక్టర్ సుగుణారెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ సంజయ్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. డిగ్రీ పట్టాతోపాటు వివిధ కంపెనీలలో ఉద్యోగాలు పొందిన విద్యార్థులను అభినందించారు. అనంతరం స్వర్ణ పతకం పొందిన విద్యార్థినీ, విద్యార్థులను వారి తల్లి దండ్రులను డా .గన్ని భాస్కర్, డైరెక్టర్ సుగుణా రెడ్డి ఘనంగా సన్మానించారు.

నిత్యవసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

స్థానిక అడబాల ట్రస్ట్ కార్యాలయంలో లయన్స్ క్లబ్ కాకినాడ విజన్ ఆధ్వర్యంలో ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు నిత్యవసర సరుకులు పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షురాలు ఎం.ప్రసూన మాట్లాడుతూ ప్రభుత్వ ఐటిఐ విశ్రాంతి ప్రిన్సిపల్ వివిజి.కృష్ణమూర్తి జ్ఞాపకార్థం ఆయన భార్య మీనాక్షి సౌజన్యంతో సరుకులు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అడబాల రత్నప్రసాద్, డాక్టర్ శిరీష, శ్రీదేవిరెడ్డి, శ్రీవాణి, నాగిరెడ్డి లక్ష్మి, సునీత, చల్ల విజయలక్ష్మి పాల్గొన్నారు.

గెలుపుపై ఎవరి ధీమా వారిది

ప్రజాశక్తి - ఏలేశ్వరం





ప్రత్తిపాడు నియోజకవర్గం నుంచి 15 మంది పోటీలో ఉండగా ఎన్‌డిఎ కూటమి, వైసిపి మధ్య మధ్య నువ్వా నేనా అన్నట్లుగా పోటీ నెలకుంది. ఎన్నడూ లేనివిధంగా 73.91 శాతం ఓటింగ్ నమోదు కావడంతో రెండు పార్టీల అభ్యర్థులు గెలుపు ధీమాలో ఉన్నారు. కూటమి అభ్యర్థి వరుపుల సత్యప్రభ తన భర్త దివంగత వరుపుల రాజా చేసిన సేవా కార్యక్రమాలతోపాటు, కూటమి కార్యకర్తల సమిష్టి కృషి తన విజయానికి దోహదం చేస్తుందని, 30 వేల ఓట్ల ఆధిక్యతతో గెలుపొందుతామనే ధీమాను వ్యక్తం చేస్తున్నారు. వైసిపి అభ్యర్థి వరుపుల సుబ్బారావు ప్రభుత్వ సంక్షేమ పథకాలు తనను గెలిపిస్తాయని, 2019లో వైసిపి 4,500 పైచిలుక ఓట్లతో విజయం సాధించిందని ఈ ఎన్నికల్లో ఆ మెజార్టీ మరింత పెరుగుతుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా ఇరు పార్టీలు శక్తి వంచన లేకుండా ప్రసారం నిర్వహించడంతోపాటు, పోల్ మేనేజ్మెంట్లో సైతం పోటీపడ్డాయి. గత ఎన్నికలతో చూసుకుంటే ఈ ఎన్నికలు మరింత రసవత్తరంగా సాగాయి. ఒకే కుటుంబంలోని తాతా-మనవరాలు పోటీ పడడంతోపాటు, నియోజకవర్గం ప్రజల ఆదరాభిమానాల కోసం, దిగువ స్థాయి క్యాడర్ ఇరు పార్టీల అభ్యర్థుల విజయానికి శక్తి వంచన లేకుండా కృషి చేశారు. టిడిపి, వైసిపిల అభ్యర్థులకు ప్రతిపాడు నియోజకవర్గంలో అధికశాతం సమీప బంధువులే కావడంతోపాటు జనసేన ఇన్‌ఛార్జ్ వరుపుల తమ్మయ్య బాబు టిడిపి విజయానికి కృషి చేశారు. నూతనంగా నియోజకవర్గంలో చేరిన ఓటర్లు, మహిళలు, యువత గణనీయంగా పోలింగ్ బూతుల కెళ్ళి ఓట్లు వేశారు. ఆ ఓట్లు ఏ పార్టీకి అధికంగా పడితే వారు విజయం సాధించేందుకు అవకాశాలు ఉన్నాయి. ఏది ఏమైనా ప్రత్తిపాడు నియోజకవర్గ విజయలక్ష్మి ఎవరిని వరిస్తుందో తెలుసుకునేందుకు జూన్ 4వ తేదీ వరకూ ఎదురుచూడక తప్పదు.

కాకినాడ జిల్లాలో 80.30 శాతం పోలింగ్

- పిఠాపురంలో అత్యధికం 86.63 శాతం
- కాకినాడ సిటీలో అత్యల్పం 72.17 శాతం

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ఒక పార్లమెంటు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగులో కాకినాడ జిల్లాలో అత్యధికంగా 80.30 శాతం పోలింగ్ నమోదైంది. 2019 సార్వత్రిక ఎన్నికలలో 80 శాతం పోలింగ్ నమోదవ్వగా కొంత ఈసారి కొంత శాతం పెరిగింది. అత్యధికంగా పిఠాపురంలో 86.63 శాతం జరిగింది. అత్యల్పంగా కాకినాడ సిటీ నియోజకవర్గంలో 72.17 శాతం నమోదైంది.

పోలింగ్ జరిగిందిలా...

జిల్లాలో 16,34,122 మంది ఓటర్లు ఉండగా 8.04.465 మంది పురుషులు, 8,.29,471 మంది మహిళా ఓటర్లు, 186 మంది ఇతరులు ఉన్నారు. ఇందులో 6,52,578 మంది పురుషులు ఓటు హక్కు వినియోగించుకోగా 6.59,575 మంది మహిళలు, 102 మంది ఇతరులు ఓటు వేశారు. తుని నియోజకవర్గంలో 2,24,538 మంది ఓటర్లు ఉండగా 1,87,183 మంది అంటే 83.36 శాతం మంది ఓటు వేశారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో 2,17,267 మంది ఓటర్లు ఉండగా 1,74,789 మంది అంటే 80.45 శాతం మంది ఓటు వేశారు. పిఠాపురం నియోజకవర్గంలో 2,36,409 మంది ఓటర్లు ఉండగా 2,04,808 మంది అంటే 86.63 శాతం మంది ఓటు వేశారు. కాకినాడ రూరల్ నియోజకవర్గంలో 2,69,330 మంది ఓటర్లు ఉండగా 2,01,833 మంది అంటే 74.94 శాతం మంది ఓటు వేశారు. పెద్దాపురం నియోజకవర్గంలో 2,15,091 మంది ఓటర్లు ఉండగా 1,76,987 మంది అంటే 82.28 శాతం మంది ఓటు వేశారు. కాకినాడ సిటీ నియోజకవర్గంలో 2,41,620 మంది ఓటర్లు ఉండగా 1,74,366 మంది అంటే 72.17 శాతం మంది ఓటు వేశారు. జగ్గంపేట నియోజకవర్గంలో 2,29,863 మంది ఓటర్లు ఉండగా 1,92,289 మంది అంటే 83.65 శాతం మంది ఓటు వేశారు.

శ్రీ ప్రకాష్ విద్యార్థుల విజయకేతనం

ప్రజాశక్తి - కోటనందూరు



సిబిఎస్ఇ ప్రకటించిన 10, ప్లస్ 2 ఫలితాలలో తుని శ్రీ ప్రకాష్ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్.విజయప్రకాష్ తెలిపారు. 10వ తరగతి ఫలితాల్లో షేక్ నజ్రీన్ 486, పెనుమత్స వర్షిణి 485, కృపాలిని పట్జోషి 484 సాధించారని తెలిపారు. ప్లస్ 2 ఫలితాల నందు వెదురుపాక విజయ్ రిషి 91 శాతం సాధించి అగ్రగాములుగా నిలిచారని, నూటికి నూరుశాతం ఉత్తీర్ణతా శాతంతో తమ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని వివరించారు. మాథ్స్, తెలుగు సబ్జెక్టుల్లో తమ విద్యార్థులు 100కి 100 మార్కులు సాధించడం హర్షణీయమన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సిహెచ్‌వికె.నరసింహారావు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లితండ్రులు అభినందించారు.

తునిలో జోరుగా పందాలు

ప్రజాశక్తి - కోటనందూరు

సార్వత్రిక ఎన్నికలు పోలింగ్ ప్రక్రియ పూర్తి కావడంతో తుని నియోజకవర్గంలో కోటనందూరు, తుని, తొండంగి మండలాల్లో వైసిపి, టిడిపి పార్టీల మధ్య జోరుగా పందాలు జరుగుతున్నాయి. కోటనందూరు మండలంలో అల్లిపూడి జగన్నాధపురం, కాకరపల్లి, బిళ్ళనందూరు, కెఇ చిన్నయ్యపాలెం, భీమవరపుకోట, కోటనందూరు గ్రామాల్లో పందాలు అధికంగా జోరందుకున్నాయి. తుని రూరల్ ప్రాంతాల్లో దొండవాక, తేటగుంట, రేకవానిపాలెం, రాజుపేట, కేఎ.మల్లవరం, రాపాక గ్రామాల్లోనూ పందాలు చోటుచేసుకున్నాయి. తొండంగి, ఒంటిమామిడి, శృంగరక్షం పెనుమళ్ళపురం, వలస పాకల గ్రామాల్లోనూ నాయకులు పందేలు కాస్తున్నారు.

వాటర్ వాల్వు లీకులు పట్టించుకోరా..?


ప్రజాశక్తి - సామర్లకోట



గాంధీ నగరం లో వాటర్ వాల్వ్ లీకుతో వృధాగా పోతున్న తాగునీరు

నిత్యం పట్టణ ప్రజలకు తాగునీరు అందించే వాటర్ పైపులైన్ వాల్వ్ లీకులు ఏర్పడి నీరు వృథాగా పోతున్నా పట్టించుకునే నాథుడు లేడు. సామర్లకోట గాంధీనగరం 28వ వార్డులో సుమారు ఆరు నెలలుగా పైపులైన్ వాల్వ్ లీకులతో నీరు వృథాగా పోతుంది. ఎన్ని సార్లు మున్సిపల్ అధికారులకు చెప్పినా పట్టించు కోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. రోజుల తరబడి తాగు నీరు వృథాగా పోతున్నా స్పందించకపోవడం దారుణమని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లీకుల వల్ల తాగునీరు కలుషితం అయ్యి ఆరోగ్య సమస్యలు ప్రబలే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పైప్‌లైన్ వాల్వ్ లీకులను అరికట్టి ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

కార్టూ'నిజం'



పిఠాపురం కోట దక్కేది ఎవరికో..?

- అంచనాలపై నేతల మల్లాగుల్లాలు
- బూత్‌ల వారీగా లెక్కలు ఆరా
- ఆధిక్యతపై ఎవరి ధీమా వారిదే

ఉత్కంఠ భరితంగా సాగిన ఎన్నికలు ముగుసాయి. పిఠాపురం అసెంబ్లీ ఓట్లు లెక్కింపుపైనే అందరి చూపు ఉంది. పిఠాపురం కోటను ఎవరు దక్కించుకుంటారనే ఉత్కంఠ నెలకుంది. అయితే గెలుపోటములపై నేతలు అంచనాలు వేసుకుంటూ మల్లాగుల్లాలు పడుతున్నారు. బూత్‌ల వారీ లెక్కలపై ఆరా తీస్తున్నారు. గెలుపుపై ఎవరికి వారే ధీమాను వ్యక్తం చేస్తున్నారు.





ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

పిఠాపురం నియోజకవర్గ ప్రజలే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా అందరూ చూపు పిఠాపురం అసెంబ్లీపై ఉంది. పిఠాపురంలో జనసేన అధ్యక్షుడు కొణిదల పవన్ కళ్యాణ్ పోటీ చేయడంతో అందరి చూపు పిఠాపురంపైనే ఉంది. 2019 ఎన్నికల్లో గాజువాక, భీమవరం నియోజకవర్గాల్లో పోటీచేసి అత్యల్ప మెజార్టీతో పవన్ కళ్యాణ్ ఓటమి చెందారు. 2024 ఎన్నికల్లో అధికార వైసిపిని గద్దెదించేందుకు టిడిపి, జనసేన, బిజెపి కూటమిగా ఏర్పడ్డాయి. ఈ కూటమి ఏర్పాటులో పవన్ కళ్యాణ్ కీలకపాత్ర పోషించారు. వై నాట్ 175 అంటూ అధికార వైసిపి ఎన్నికల ముందు పెద్దఎత్తున ప్రచారం చేసింది. అందుకు అనుగుణంగా కార్యచరణతో అడుగులు వేస్తూ దూకుడును ప్రదర్శించింది. ఈ నేపథ్యంలోనే వైసిపి దూకుడుకు అడ్డుకట్ట వేసేందుకు పవన్ కళ్యాణ్ ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీలనివ్వబోనని ప్రకటించారు. అందుకు అనుగుణంగా టిడిపి, బిజెపికి మధ్య స్నేహహస్తాన్ని ఇచ్చి కూటమిగా ఏర్పడటంలో కీలకపాత్ర పోషించారు. ఉమ్మడిగానే ఎన్నికల బరిలో నిలిచారు. గెలుపే లక్ష్యంగా కూటమి అభ్యర్థిగా పవన్ కళ్యాణ్ పిఠాపురం నియోజకవర్గం నుంచి పోటీ చేశారు. పవన్ కళ్యాణ్‌ను ఈ ఎన్నికల్లోనూ ఓడించేందుకు వైసిపి పెద్దఎత్తున ఎత్తుగడలు వేసింది. సిట్టింగ్ ఎంఎల్ఎ పెండెం దొరబాబును కాదని, కాకినాడ ఎంపీ వంగా గీతను పవన్ కళ్యాణ్‌పై పోటీకి దించింది. దీంతోపాటు ఈ నియోజకవర్గం బాధ్యతలను ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డికి అప్పగించింది. ఆయనకుతోడు మంత్రి దాడిశెట్టి రాజా, మాజీ మంత్రి కురసాల కన్నబాబు, ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డిలను మండలాల వారీగా ఇన్‌ఛార్జులుగా నియమించింది. వీరికితోడు కాపు ఉద్యమనాయకుడు, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం సైతం పవన్ కళ్యాణ్ ఓటమికి కృషి చేశారు. పిఠాపురం నుంచి బరిలో నిలిచిన వంగా గీత, పవన్ కళ్యాణ్ పక్షాన పోటాపోటీగా ప్రచారం జరిగింది. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఎన్నికల ప్రచారం ఆఖరిరోజున భారీ బహిరంగ సభలో పాల్గొన్నారు. ఇక పవన్ కళ్యాణ్ విజయం కోసం వెండి, బుల్లి తెరకు చెందిన సిని హీరోలు, హాస్యనటులతోపాటు, పవన్ సోదరుడు నాగబాబు పిఠాపురం కేంద్రంగానే ఉండి ప్రచారాన్ని నిర్వహించారు. ఎన్నికల ప్రచారం ఒక ఎత్తేయితే ఓటర్లకు ప్రలోభాలకు గురిచేయడంలో ఇరు పార్టీలు పోటాపోటీగానే తలపడ్డాయి. అయితే వైసిపి ఓటర్లకు అందించిన నగదు పంపిణీలో వ్యత్యాసం చూపడంతో అబాసపాలైయింది. ఓటుకు నోటు అందని మహిళలు వైసిపి కార్యాలయానికి వచ్చి ధర్నాలకు దిగిన పరిస్థితి నెలకుంది. పోలింగ్ రోజున బూత్‌ల పరిశీలకు వచ్చిన వైసిపి అభ్యర్థి వంగా గీత మహిళా ఓటర్ల నుంచి నిరసనను ఎదుర్కొన్నారు. డబ్బు పంపిణీ వంగా గీతకు అడ్డుగీతగా మారిందనేది ప్రస్తుతం ప్రచారం జరుగుతోంది. వైసిపికి దక్కాల్సిన ఓట్లు సైతం ఈ నిర్వాకం వల్ల జనసేన పార్టీకి వెళ్లాయనే ప్రచారం లేకపోలేదు. ప్రస్తుత పరిస్థితుల్లో వంగా గీత గెలుపు తథ్యమని ఆ పార్టీ నాయకులు సైతం ధైర్యంగా చెప్పలేకపోతున్నారు. పవన్ కళ్యాణ్ 60 వేల నుంచి 70 వేల ఆధిక్యతతో విజయం సాధిస్తారని జనసేన పార్టీ నాయకులు ఢంకాపథంగా చెబుతున్నారు. అయితే పిఠాపురం కోటను ఎవ్వరు దక్కించుకుంటారనే ఉత్కంఠ మాత్రం ప్రజల్లో నెలకుంది. దీంతో పిఠాపురం సీటుపై ప్రజలలో ఉత్కంఠ నెలకొంది

నేరాలు ఘోరాలు


మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

మొబైల్ షాపులో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి - కాజులూరు

మండల కేంద్రమైన కాజులూరు జడ్‌పి పాఠశాల ఎదురుగా ఉన్న మొబైల్ షాపులో అగ్నిప్రమాదం సంభవించింది. స్థానికులు చెప్పిన వివరాల మేరకు.. మంగళవారం తెల్లవారుజామున గ్రామానికి చెందిన బలబద్రుని కామేష్ మొబైల్ షాప్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో మొబైల్ షాప్ పూర్తిగా దగ్ధమైంది. షాపు నుంచి పొగలు రావడం గమనించిన స్థానికులు షాపు యజమాని ఇంటికి సమాచారం అందించారు. అతను వచ్చి షాపు షట్టర్ తెరిచేలోపు షాపు పూర్తిగా కాలిపోయింది. షాపులో ఖరీదైన మొబైల్స్, స్మార్ట్ వాచీలు జిరాక్స్ మిషన్లు ఇటీవల అమర్చిన ఎయిర్ కండిషన్ ఇతర సామాగ్రి పూర్తిగా ఖాళీ బూడిదవడంతో ఆస్తి నష్టం రూ.15 లక్షల వరకు ఉండవచ్చునని అంచనా వేస్తున్నారు. ప్రమాదం ఏ విధంగా జరిగింది అనే దానిపై తేలవలసి ఉంది. కాకినాడ ఫైర్ సిబ్బంది ఘటనస్థలికి వచ్చి మంటలను అదుపు చేశారు. ప్రమాదం ఏ విధంగా జరిగిందనే దానిపై తేలవలసి ఉంది.

ఎస్‌ఇబి దాడుల్లో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - గోపాలపురం

మండలంలోని వాదాలకుంట గ్రామంలో ఎస్‌ఇబి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించినట్లు ఎస్‌ఇబి సిఐ కెవి.స్వామి మంగళవారం తెలిపారు. ఈ దాడులలో 12 మద్యం సీసాలతో ఒక వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. ఈ దాడుల్లో ఎస్ఐ పి.సుధీర్, సిబ్బంది పాల్గొన్నారు.

యువకునిపై హత్యాయత్నం

ప్రజాశక్తి - అమలాపురం

పాతకక్షల నేపథ్యంలో అమలాపురం పట్టణంలో మంగళవారం యువకునిపై హత్యాయత్నం జరిగింది. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. అమలాపురం పట్టణంలోని మోబర్లీపేట వద్ద అమలాపురం రూరల్ మండలం సమనస గ్రామానికి చెందిన మంగా బాలయోగిపై అదే గ్రామానికి చెందిన కోండ్రు కోటేశ్వరరావు హత్యాయత్నం చేశాడు. స్థానికులు అడ్డుకోవడంతో మంగా బాలయోగి, ఘటన సమయంలో అతని కూడా ఉన్న ఆయన కుమారుడు వెంకటేష్ మనుమరాలు చొప్పెల గుణశ్రీ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. హత్యాయత్నానికి పాల్పడిన కోండ్రు కోటేశ్వరరావుకు స్థానికులు దేహశుద్ధి చేశారు. గతంలో వెంకటేశ్వరరావు భార్యను ఎస్‌పి బంగ్లాకు సమీపంలో హత్య కేసులో నిందితులుగా ఉన్న బాలయోగి కుటుంబ సభ్యులు మంగళ వారం కోర్టు వాయిదా ఉండడంతో కోర్టుకు వస్తున్నట్లు తెలుసుకున్న కోటేశ్వరరావు తెలుసుకున్నాడు. దీంతో అతను కాపు కాసి నిందితులపై దాడి చేశాడు. ఈ దాడిలో మంగా బాలయోగి మనుమరాలకు చొప్పెల గుణశ్రీ కత్తి గాయమైంది. కాగా దీంతో తిరగబడిన మంగా బాలయోగి తదితరులు ఎదురుదాడి చేసి అదే కత్తితో గాయం చేయడంతో పాటు రాడ్డుతో తలపై కొట్టడంతో కోటేశ్వరరావు తీవ్ర గాయాలయ్యాయి. తీవ్ర గాయాలు పాలైన అతనిని స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. కొంతకాలంగా సమనస గ్రామానికి చెందిన కోండ్రు వెంకటేశ్వరరావు, మంగా బాలయోగి కుటుంబాల మధ్య సరిహద్దు వివాదం కొనసాగుతోంది. పోలీసులు క్షతగాత్రులను అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందిస్తున్నారు. సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ లీలా కృష్ణ అరెస్ట్

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

మండపేట నియోజకవర్గం జనసేన ఇంచార్జ్ వేగుళ్ల లీలా కృష్ణను మండపేట రూరల్ సీఐ అరెస్ట్ చేశారు. అంగరఎస్ఐ పరదేశి తెలిపిన వివరాల మేరకు సోమవారం ఎన్నికల సందర్భంగా కపిలేశ్వరపురం మండలం వల్లూరు పోలింగ్ కేంద్రం లో ఓటర్లు ఉండిపోవడంతో అక్కడ కూపన్లు ఇచ్చి లోపల ఓటింగ్ నిర్వహిస్తున్నారు. రాత్రి సమయం కావడంతో అక్కడకు ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు ఆయన తనయుడు తోట పృథ్వీరాజ్ ఇతర వైసీపీ నాయకులు చేరుకున్నారు. వైసిపి నాయకులు టిడిపి జనసేన నాయకుల మధ్య కవ్వింపు సంఘటనలు చోటు చేసుకున్నాయి. రెండు వర్గాలు దాడులకు దిగినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఎంఎల్‌సి తనయుడు తోట పృథ్వీరాజ్ వాహనాన్ని ధ్వంసం చేశారన్న ఆరోపణలు అదే గ్రామానికి చెందిన రుద్రయ్య చౌదరిపై జనసేన ఇంచార్జ్ వేగుళ్ల లీలా కృష్ణ దాడి చేసి హత్యాయత్నానికి ప్రయత్నించారని అంగర పోలీసులకు రుద్రయ్య చౌదరి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అంగర పోలీసులు జనసేన ఇంచార్జ్ లీలా కృష్ణ తో పాటు మరో నలుగురిపై కేసు నమోదు చేశారు.మంగళవారం తెల్లవారుజామున వల్లూరు లో లీలా కష్ణను అదుపులోకి తీసుకున్నారు. ఇక్కడ నుండి ఆయనను కె.గంగవరం మండలం పామర్రు పోలీస్ స్టేషన్కు తరలించారు. అక్కడి నుండి పోలీసు బందోబస్తు తో లీలా కష్ణను రామచంద్రపురం కోర్టుకు తరలించారు. కాగా మండపేట ఎంఎల్‌ఎ వేగుళ్ల జోగేశ్వరరావు, మాజీ మున్సిపల్ ఛైర్మన్ చుండ్రు శ్రీ వరప్రకాష్, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు వి.సాయికుమార్ బాబు, జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు కోన సత్యనారాయణ, టిడిపి నాయకులు నెక్కింటి బాలకష్ణ, అధిక సంఖ్యలో కార్యకర్తలు లీలా కృష్ణకు సంఘీభావం తెలిపారు.ఆయన అరెస్టు అప్రజాస్వామికమని ఎంఎల్‌ఎ వేగుళ్ళ ఖండించారు.

పలుచోట్ల పెరిగిన ఓటింగ్ శాతం

జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో గత ఎన్నికలతో పోలిస్తే ఈ ఎన్నికల్లో పోలింగ్ శాతం గణనీయంగా పెరిగింది. సోమవారం ఉదయం ఏడు గంటల నుంచి ప్రారంభమైన పోలింగ్ కొన్ని పోలింగ్ బూత్‌ల్లో అర్ధరాత్రి 12 గంటల వరకూ సాగింది. దీంతో ఎంతశాతం పోలింగ్ నమోదు అయ్యిందనే అంశం మంగళవారం సాయంత్రానికి కానీ ఎన్నికల అధికారులు తేల్చలేకపోయారు. జిల్లాలోని పిలు నియోజకవర్గాల్లో పోలింగ్ శాతం ఇలావుంది.

ప్రజాశక్తి - యంత్రాంగం

పెద్దాపురంలో 82.29 ఓటింగ్ నమోదు

పెద్దాపురం నియోజకవర్గంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్లో 201 పోలింగ్ కేంద్రాల్లో 82.29 శాతం పోలింగ్ నమోదైంది. పురుష ఓటర్ల కన్నా మహిళా ఓటర్లు అధికంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయం ఒక ప్రకటనలో వెల్లడించారు. నియోజవర్గంలో మొత్తం ఓట్లు 2,15,095 ఉండగా, వాటిలో 1,76,993 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పురుషుల ఓట్లు : 88,090 నియోగించుకోగా, మహిళలు 88,895 ఓటు హక్కును వినియోగించుకున్నట్లు చెప్పారు. ట్రాన్స్‌జెండర్‌లు ఎనిమిది మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని తెలిపారు. మొత్తం మీద పురుషుల కన్నా స్త్రీలే అధికంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజవర్గ పరిధిలో కొన్ని పోలింగ్ బూత్‌లో మందకోడిగా పోలింగ్ సాగడంతో రాత్రి 11:30 గంటల వరకు బారులు తీరిన ఓటర్లు ఓట్లు వేశారు. 2019 ఎన్నికల్లో 75 శాతంఓటింగ్ నమోదు కాగా ఈ దఫా ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరగడం గమనార్హం.


సామర్లకోట మండలం వేమవరంలో అర్ధరాత్రి కొనసాగిన పోలింగ్

పిఠాపురంలో 86.63 పోలింగ్ నమోదు

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పిఠాపురం నియోజకవర్గంలో సోమవారం జరిగిన పోలింగ్‌లో 86.63శాతం నమోదైంది. మొత్తం 2,36,409 మంది ఓటర్లు ఉండగా 2,04,811 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వారిలో పురుషులు 1,03,370 మంది, మహిళలు 1,01,438, ట్రాన్స్‌జెండార్స్ ముగ్గురు ఓటు హక్కును వినియోగించుకున్నారని రిటర్నింగ్ అధికారి ఎస్.రామసుందర్‌రెడ్డి తెలిపారు. పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు 40 మంది ఎక్కువ ఉండగా మహిళల కంటే పురుషులే అధికంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 2019 ఎన్నికల్లో 81.71 శాతం పోలింగ్ నమోదు అవ్వగా ఈ సారి పోలింగ్ 4.92 శాతం ఎక్కువగా నమోదు అయ్యింది.

తునిలో 83.36 శాతం నమోదు

తుని నియోజకవర్గంలో తుని, తొండంగి, కోటనందూరు మండలాల్లో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 83.36 శాతం ఓట్లు పోలయ్యింది. మూడు మండలాల్లోనూ మొత్తం ఓటర్లు 2,24,538 ఉండగా1,87,215 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని తుని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కెవి.రమాదేవి తెలిపారు. తుని నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేనంత విధంగా అధిక సంఖ్యలో ఓటర్లు ఉత్సాహంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. టిడిపి, వైసిపిల మధ్య పోటీ హోరాహోరీగా సాగింది. ఆయా పార్టీ నాయకులే హైదరాబాదు, విశాఖపట్నం, రాజమహేంద్రవరం, శ్రీకాకుళం, విజయనగరం, పాలకొండ ప్రాంతాల్లో జీవనోపాధి కోసం వెళ్లిన వారిని ప్రత్యేక వాహనాల్లో రప్పించి ఓట్లు వేయించుకునేలా ఏర్పాట్లు చేసుకున్నారు. ఓటర్ల తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి పోటెత్తడంతో ఓటింగ్ ప్రక్రియ ఆలస్యంగా ముగియడంతో ఇవిఎంల తరలింపు రాత్రి 12 గంటల వరకు సాగింది.

ముమ్మిడివరంలో 83.64 పోలింగ్

ముమ్మిడివరం నియోజకవర్గంలోని 4 మండలాలైన తాళ్ళరేవు, ఐ.పోలవరం, కాట్రేనికోన, ముమ్మిడివరం నగర పంచాయతీ, ముమ్మిడివరం రూరల్‌లలో 83.64 శాతం పోలింగ్ జరిగినట్లు రిటర్నింగ్ అధికారి మదన్మోహన్ తెలిపారు. 2,45,296 మంది ఓటర్లకు గాను 2,05,163 మంది ఓటర్లు ఓటు హక్కును ఉపయోగించుకున్నారు వీరిలో 1,03,951 మంది పురుషులు 1,01,212 మంది మహిళలు ఉన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా మహిళలు 41.26 శాతం ఓటు హక్కు వినియోగించుకోగా, పురుషులు 42.37 శాతం మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈసారి మహిళల కంటే 1.11 శాతం మంది పురుషులు అధికంగా ఓటు హక్కు వినియోగించుకోవడం గమనార్హం.

19 నుంచి వెంకన్న కళ్యాణోత్సవాలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

ప్రసిద్ధిగాంచిన భూసమేత వేంకటేశ్వరస్వామి కళ్యానోత్సవాలు ఈ నెల 19నుంచి 24 వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ ప్రధాన అర్చకులు ఖండవిల్లి కేశవాచార్యులు నేతృత్వంలో ఈ నెల 19న అంకురార్పణ, ధ్వజారహణ, రాత్రి 7 గంటలకు వేద పండితులు వాడపల్లి గోపాలాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారి పరిణయ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. 20న కొఠాయి ఉత్సవం, 21న సదస్యము, 22న రథోత్సవం, 23న స్వామికి పూర్ణాహుతి, చక్రస్నానం, సహస్రదీపాలంకరణ. ఊంజల్ సేవ, 24న శ్రీపుష్పయాగం, పవళింపు సేవ వంటి కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తామన్నారు. కళ్యాణోత్సవాల ముగింపు సందర్భంగా 26వ తేదీన అన్న ప్రసాద వితరణ కార్యక్రమం జరుగుతుందన్నారు. కళ్యాణ మహోత్సవాల సందర్భంగా ఈ నెల 15వ తేదీ బుధవారం స్వామి మూల విరాటు పంచామృతాలు, పండ్ల రసాలు, సుగంధ ద్రవ్యాలతో పూర్ణాభిషేకం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆయా కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాల్సిందిగా ఆలయ కమిటీ సభ్యులు కోరారు.


చెయ్యేరు ఇంజినీరింగ్ కళాశాల్లో స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పోలీసు సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్‌పి శ్రీధర్

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత


ఎస్‌పి శ్రీధర్

ప్రజాశక్తి ముమ్మిడివరం

పార్లమెంట్, అసెంబ్లీ సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఇవిఎం లను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ ల వద్ద మూడంచెల పటిష్ట భద్రత ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్‌పి శ్రీధర్ అన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని స్థానిక చెయ్యేరు శ్రీనివాస్ ఇంజినీరింగ్ కళాశాల్లో స్ట్రాంగ్ రూమ్ ల్లో భద్రపరిచిన ఇవిఎం లను మంగళవారం సాయంత్రం ఎస్‌పి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్ట్రాంగ్ రూమ్ ల వద్ద మూడంచెల పటిష్ట భద్రత ఏర్పాటు చేశామన్నారు. ఎవరైనా సోషల్ మీడియా ద్వారా గానీ లేదా ప్రత్యక్షంగా గానీ కవ్వింపు చర్యలకు పాల్పడినా, అలజడులు సష్టించినా, ప్రోత్సహించినా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా అట్టివారి పై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట డిఎస్‌పిలు, సిఐ మరియు ఎస్ఐలు పాల్గొన్నారు.

కోనేటి సరస్సులా.... పానేటి కాలువ

ప్రజాశక్తి - తాళ్లరేవు


సరస్సులో కన్పిస్తున్న పానేటి కాలువ

వేసవి రాగానే తాగు నీటి ఎద్దడి ప్రారంభమవుతుంది. నీళ్లు ఎక్కడ ఉంటే అక్కడకు ప్రజలు పరుగులు తీస్తుంటారు. అది ముందుగా గ్రహించారు, ఆ పంచాయతీ అధికారులు, పాలక వర్గం. ప్రజలకు తాగునీటి ఎద్దడి రాకుండా దాహార్తిని తీర్చే పానేటి కాలువకు ముందు జాగ్రత్త చర్యగా పంట నీరు కాలువలోకి పంపింగ్ చేశారు. దీంతో పానేటి కాలువ కోనేటి సరస్సులా మారింది. మండలంలోని నీలపల్లి గ్రామపంచాయతీకి చెందిన నీలపల్లి, పత్తిగొంది మార్గంలో ఉన్న సుమారు 10 ఎకరాల పానేటి కాలువ ఎన్నో దశాబ్దాలుగా వేసవిలో ప్రజలకు దాహార్తిని తీర్చడమే కాకుండా మిగిలిన కాలాల్లో రైతాంగానికి, సేద్యానికి ఎంతగానో మేలు చేస్తుంది. సాగునీటి ఎద్దడి సమయంలో పానేటి కాలువలోని నీటిని పంట పొలాలకు మళ్లించి వందలాది ఎకరాలు సాగు చేస్తుంటారు. రైతాంగం కొబ్బరి తోటలకు ఈ పానేటి కాలువ నీటిని ఉపయోగిస్తుంటారు. వేసవిలో గ్రామంలో ఉన్న కుళాయి చెరువు నీరు తగ్గినప్పుడు ఈ పానేటి కాలువ నీటిని ప్రాసెసింగ్ చేసి తాగునీటికి ఉపయోగిస్తారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని అధికారులు పానేటి కాలువను ముందుగా సాగునీటితో నింపారు. దీంతో పానేటి కాలువ జలకళతో ఉట్టిపడుతుంది. దీనికి తోడు కాలువలోని తామర మొగ్గలు పువ్వులుగా వికసించి పానేటి కాలువకు మరింత అందాన్ని, శోభను తీసుకొచ్చాయి. దారి వెంట వెళ్లే ప్రయాణికులు కాలువ అందాలను ఆస్వాదిస్తున్నారు. చూపరులను పానేటి కాలువ కట్టిపడేస్తుంది.

ఓటరు తీర్పుపై సర్వత్రా ఆసక్తి

ప్రజాశక్తి-ముమ్మిడివరం


ఈ నెల 13న జరిగిన పోలింగ్‌లో బారులు తీరిన ఓటర్లు

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది....ఇక ఓటరు తీర్పు ఎలా ఉండబోతుందన్న దానిపై చర్చలు తీవ్రమయ్యాయి. పోలింగ్ సరళి పై ఎవరి లెక్కలు వారు వేసుకుంటూ ఫలితాలు తమకే అనుకూలంగా ఉంటాయంటే తమకే అనుకూలంగా ఉంటాయని, మెజార్టీ తమకే వస్తుందని అధికార ప్రతిపక్ష పార్టీల మద్దతుదారులు చర్చించుకుంటున్నారు. నియోజకవర్గంలో ఎక్కడ చూసినా ఎవరు గెలుస్తారనే చర్చ జరుగుతోంది. అభ్యర్థుల భవితవ్యం తేలాలంటే ఇంకా 3వారాలు ఆగాల్సిందే. వైసిపి ముఖ్యంగా నియోజకవర్గ ప్రధాన కేంద్రమైన మండలం మరియు పట్టణ ప్రాంతమైన ముమ్మిడివరం నగర పంచాయతీ, మత్స్యకార గ్రామాలు అధికంగా ఉన్న కాట్రేనికోన, తాళ్ళరేవు మండలాల మత్స్య కారులు మరియు ఎస్‌సిలు, సంక్షేమ పథకాల లబ్ధిదారులు, మహిళా ఓటర్ల తో పాటు పార్టీకి అనుకూలంగా ఉన్న వారి వివరాలు సేకరించి వాటిని క్రోడీకరించుకుని గెలుపు ధీమా వ్యక్తం చేస్తుంటే, కూటమి అభ్యర్థికి ప్రచారం లో అన్నివర్గాల ప్రజల నుంచి వచ్చిన సానుకూల స్పందనతో పాటు గతంలో చేసిన అభివద్ధి కార్యక్రమాలు వంటి గత అనుభవాలను దష్టిలో ఉంచుకుని ఫలితాలు తమకే సానుకూలంగా ఉన్నాయని విజయం తథ్యం అనే ధీమాతో శ్రేణులు రెట్టింపు ఉత్సాహంతో కౌంటింగ్ రోజు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్నారు. ఏది ఏమైనా ముమ్మిడివరం విజేత ఎవరు అనేది తెలియాలంటే మూడు వారాలు ఉత్కంఠతతో ఎదురుచూడాల్సిందే.

'రూరల్‌లో కూటమిదే గెలుపు'

ప్రజాశక్తి - కాకినాడ రూరల్



కాకినాడ రూరల్ నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి పంతం నానాజీ విజయం సాధిస్తారని టిడిపి కాకినాడ రూరల్ ఎన్నికల కోఆర్డినేటర్ నులుకుర్తి వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం ఆయన సార్వత్రిక ఎన్నికల సరళిపై ఓ ప్రకటనను విడుదల చేశారు. గ్రామాల్లో ఓటింగ్ సరళిని బట్టి ప్రజలు కూటమి పక్షానే ఉన్నారన్న విషయం తేటతెల్ల మైందన్నారు. కూటమి అమలు చేసే సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికి మేలు చేకూర్చుతాయని ప్రజలు విశ్వసించారని అన్నారు. తమ పార్టీశ్రేణులంతా గ్రామాల్లో చేసిన ప్రచారమే తారకమంత్రంగా పనిచేసిందన్నారు. వారి పట్ల ఉన్న ఆదరణ అందరికి అవగతమైందన్నారు. చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి అవ్వడం ఖాయమని ఆయన తెలిపారు. కాకినాడ రూరల్, కరప మండలాలతోపాటు అర్బన్‌లోని 8 డివిజన్లు కలిపి మంచి మెజార్టీతో గెలుస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. జిల్లాలో మెజార్టీ స్థానాలు టిడిపి కూటమి కైవసం చేసుకుంటుందన్నారు. కూటమి గెలుపుతో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమపాలన అమలౌతుందని అన్నారు.

నవోదయ విద్యాలయంలో 100 శాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి - యానాం

స్థానిక మెట్టకూరు జవహర్ నవోదయ విద్యాలయ విద్యార్థులు 10, 12వ తరగతి పరిక్ష ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపల్ టివిఎస్.ప్రకాశరావు తెలిపారు. 10వ తరగతిలో యు.సుహితా ఏంజెల్ 98.40 శాతంతో ప్రథమ, ఎస్ఎస్‌పి.సాయిప్రణీత్ 94.50 శాతంతో ద్వితీయ, వి.త్రినయ్‌సాయిచరణ్ 94.30 శాతంతో తృతీయ స్థానాలు సాధించారన్నారు. 12వ తరగతిలో కె.విశాలాక్షి భవ్య 91.80 శాతం, ఆదిత్య రంజన్నాగ్ 91 శాతం, పి.ప్రశాంతకుమార్ 90.60 శాతం మార్కులతో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారని వివరించారు. విద్యాలయ చరిత్రలోనే ఇది అత్యుత్తమ రికార్డు అని చెప్పారు. సహకరించిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను ఆయన అభినందించారు.

బస్టాండ్‌లో కానరాని వసతులు

- అవస్థ పడుతన్న ప్రయాణికులు
- రామచంద్రపురం బస్టాండ్‌లో వసతులు మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి

ప్రజాశక్తి-రామచంద్రపురం

పట్టణంలో గల రామచంద్రపురం బస్టాండ్ కనీస వసతులు లేక ప్రయాణికులు విలవిల్లాడుతున్నారు. 1985 నిర్మించిన బస్టాండ్ ఇప్పటికీ అభివద్ధి పనులకు నోచుకోలేదు. బస్టాండ్ నుంచి బయటకు వచ్చే రహదారితో పాటు ఇరువైపులా చెత్తాచెదారం పేరుకుని దుర్గంధం వెదజల్లుతుంది. జిల్లా నలుమూలల నుండి నిత్యం వందలాదిమంది ప్రయాణికులు ఈ బస్టాండ్కు వస్తుంటారు. ఇక్కడ బస్టాండ్ లో కూర్చునే కుర్చీలు సైతం విరిగిపోయి వంకర్లు తిరిగి ఉండడంతో కూర్చునేందుకు కూడా ప్రయాణికులు ఇబ్బందులకు గురికావాల్సి వస్తోంది. అదేవిధంగా ఇక్కడ ఏర్పాటు చేసిన తాగునీటి సౌకర్యం పూర్తిగా నాచుపట్టి అక్కడ మంచినీళ్ల తాగాలంటే ప్రయాణికులకు నమస్కరించడం లేదు. అసలు బస్టాండ్ లో మంచినీరు సౌకర్యం ఎక్కడుందో కూడా తెలియని విధంగా పైకి వెళ్లే మెట్లు మార్గం పక్కన ఒక సందులో ఏర్పాటు చేశారు.. ఇక టాయిలెట్ల గురించి చెప్పనవసరం లేదు. సరైన నిర్వహణ లేక ఎక్కడ టాయిలెట్లు పూర్తిగా శిథిలావస్థలు చేరుకుని ఉన్నాయి. అదేవిధంగా ప్రయాణికులు సౌకర్యం ఏర్పాటు చేసిన టీవీలు గత రెండేళ్లుగా పనిచేయడం లేదు. ప్రయాణికులు టిక్కెట్లు చార్జీలు పెంచడంతో ఎంతో శ్రద్ధ చూపించే ఆర్టీసీ సంస్థ. ప్రయాణికులను దష్టిలో ఉంచుకుని వారికి కనీస సౌకర్యాలు కల్పించాలన్న సంగతి పక్కన పెట్టినట్లు ఇక్కడ పరిస్థితులను బట్టి అర్థమవుతుంది. ఐదేళ్ల క్రితం అనేక బస్టాండ్లను ఆధునికరించినప్పటికీ రామచంద్రపురం బస్టాండ్ నేటికీ ఆధునికీకరించకపోవడం విశేషం. దీనిపై అధికారులు స్పందించి బస్టాండ్ ను ఆధునికీకరించాలని, ప్రయాణికులకు కనీస వసతులైన కుర్చీలను, చల్లని తాగునీటిని ఏర్పాటు చేయాలని, బస్టాండ్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ప్రయాణికులు బయటకు వచ్చే రహ దారిని అభివద్ధి పరచాలని, టాయిలెట్లను ఆధునికరించి ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని, టీవీలు ఫ్యాన్లు సక్రమంగా పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని, తాగునీటిని ప్రయాణికులకు అందుబాటులో మినరల్ వాటర్ అందించాలని, ప్రజలు ప్రయాణికులు ఆర్‌టిసి అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు..


నిరుపయోగంగా ఉన్న కుర్చీలు


రామచంద్రపురం బస్టాండ్‌లో పనిచేయని టీవీలు



అపరిశుభ్రంగా ఉన్న తాగునీటి సౌకర్యం ఉన్న ప్రాంతం